సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 11 । జనవరి । 2025



వైభవంగా గిరి ప్రదక్షిణ
IIలో

అనకాపల్లి జిల్లాలో వడ్డాది వేంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చారు.



ఘనంగా రాపత్తు ఉత్సవాలు

విశాఖ: సింహగిరిపై శుక్రవారం సాయంత్రం నుంచి రాపత్తు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.
IIలో



15న మహా బౌద్ధమేళా

అనకాపల్లి మండలంలోని బొజ్జన్న కొండ వద్ద ఈనెల 15వ తేదీ కనుమ పండగనాడు మహాబౌద్ధ మేళా జరుగుతుంది.
IIలో

న్యూస్‌రీల్

కాఫీ నాణ్యతపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు

చింతపల్లి: పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో చింతపల్లి కేంద్రంగా నిర్వహిస్తున్న కాఫీ ఎకో పల్పింగ్‌కేంద్రం ద్వారా నాణ్యమైన పండ్లను సేకరించాలని పాడేరు ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం చింతపల్లి వచ్చిన ఆయన స్థానిక ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల కాఫీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గిరిజన రైతులనుంచి సేకరించే కాఫీలో నాణ్యత పాటించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో చింతపల్లి కాఫీ పరిశ్రమ ఇన్‌చార్జి అప్పలనాయుడు పాల్గొన్నారు.

మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలి

- డీఈవోకు ఎంటీఎస్ ఉపాధ్యాయుల విజ్ఞప్తి



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

విశాఖ విద్య: ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న 1998 డీఎస్సీకి చెందిన ఎంటీఎస్ టీచర్లను మైదాన ప్రాంతాలకు బదిలీపై తీసుకురావాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో కార్యాలయం ముందు నిరసన తెలిపి, అనంతరం డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 1998 డీఎస్సీ ద్వారా ఎంపికై, గత విద్యా సంవత్సరం ఏప్రిల్‌లో నియమితులైన తమకు ఏజెన్సీ ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డీఈవోకు వివరించారు. తమను సొంత మండలాల సమీపానికి బదిలీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

రేపు శ్రీనృసింహ దీక్షల విరమణ

సింహాచలం(విశాఖ) : సింహగిరిపై ఆదివారం ఉదయం 7 నుంచి శ్రీనృసింహ దీక్షల విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. దీక్షాధారులందరిచేత దీక్షా విరమణను శాస్త్రోక్తంగా దేవస్థానం వైదికులు నిర్వహించనున్నారు. 41 రోజుల శ్రీనృసింహ దీక్ష, 32 రోజుల శ్రీనృసింహ దీక్ష తీసుకున్నవారంతా ఆదివారం సింహగిరిపై దీక్షా విరమణ చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

10 మందికి ఉద్యోగాలు

అరకులోయ టౌన్: స్థానిక ఆర్ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 10 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి. రోహిణి తెలిపారు. మొత్తం 23 మంది హాజరు కాగా మూడు కంపెనీల్లో ఉద్యోగాలకు కేవలం 10 మంది అభ్యర్థులు మాత్రమే ఎంపికయ్యారని ఆమె వివరించారు. జేడీఎం కల్యాణి, ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు నియామక పత్రాలు అందజేశారు.

దట్టంగా పొగమంచు



చింతపల్లిలో కురుస్తున్న పొగమంచు

చింతపల్లి: మండలంలో చలితీవ్రత పెరిగింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించలేనంతగా మంచు దట్టంగా కురుస్తోంది. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు.

రేపు గిరిజన మ్యూజియం, గిరి గ్రామదర్శిని మూసివేత

అరకులోయ టౌన్: ప్రముఖ సందర్శిత ప్రాంతాలైన అరకులోయలోని గిరిజన మ్యూజియం, పెదలబుడులోని గిరిగ్రామ దర్శినిని ఈనెల 12న మూసివేస్తున్నట్టు పాడేరు ఐటీడీఏ పీవో వి. అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలన పరమైన కారణాల వల్ల మూసివేస్తున్నామని తెలిపారు. ఆ ఒక్కరోజు ప్రవేశం లేదని, ఈ విషయాన్ని పర్యాటకులు గమనించాలని ఆయన కోరారు. మరుసటిరోజు 13వ తేదీ నుంచి యథాతథంగా ప్రవేశం ఉంటుందని పీవో తెలిపారు.

గుమ్మడి కాయలతో గిరిజనులకు విడదీయరాని బంధం ఉంది. ఒకప్పుడు వారికి నిత్యవంటకంగా ఉండే గుమ్మడి ఇప్పుడు మంచి ఆదాయ వనరుగా మారింది. సహజసిద్ధంగా కాయడం వల్ల వీటికి మంచి డిమాండ్ ఉంది. వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేసి తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. సంక్రాంతి పండగ నాడు వీటి వినియోగం ఎక్కువ కావడంతో మన్యంలోని వారపు సంతల్లో అమ్మకాలు జోరందుకున్నాయి.

గుమ్మడికి పండగే

మన్యం పండ్లకు నాలుగు రాష్ట్రాల్లో ఖ్యాతి





తీగలవలసలో పాదును కాసిన గుమ్మడికాయ

- రుచిలో మేటి
- ప్రతి ఇంటా నిత్య వంటకం
- పుణ్యక్షేత్రాల్లోని నిత్యాన్నదానంలోను వినియోగం
- ఇంటిపెరటితోపాటు కొండపోడులో సాగు
- మన్యం నుంచి నాలుగు రాష్ట్రాలకు ఎగుమతి
- వారపు సంతల్లో అమ్మకాల జోరు

సాక్షి,పాడేరు: మన్యంలో గిరిజనులు గుమ్మడిని ప్రత్యేకంగా సాగు చేయరు. ఇంటి పెరట్లో, ఖాళీ స్థలాలు, కొండపోడు భూముల్లో విత్తనాలు చల్లుతారు. పాదుకు 20 నుంచి 30 కాయల వరకు కాస్తాయి. చాలామంది గిరిజనులు గుమ్మడి కాయను నిత్య వంటకానికి ఉపయోగిస్తున్నారు. ఎంతో ఇష్టంగా తినడం వల్ల ఇంటికి వచ్చే అతిథులకు గుమ్మడి కూర వండి పెడుతుంటారు. లేత పిందెలతో కొంతమంది కూర తయారు చేస్తుంటారు.

- గుమ్మడిలో పోషక విలువలు ఎక్కువ ఉన్నందున వినియోగం పెరిగింది. కొంతమంది గిరిజనులు పిందె దశలో ఒకొక్కటి రూ.20 నుంచి రూ.30కు విక్రయిస్తున్నారు. బాగా పండిన కాయను రూ.50 నుంచి రూ.80కు అమ్ముతున్నారు. ఎటువంటి పెట్టుబడి పెట్టకుండా ఒకొక్క గిరిజనుడు రూ.2వేల వరకు ఆదాయం పొందుతున్నారు.
- ఏజెన్సీలో జరుగుతున్న వారపు సంతల్లో గుమ్మడి అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ ప్రాంతం నుంచి నాలుగు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. మంగళవారం జి.మాడుగుల,

బుధవారం కించుమండ, చింతపల్లి, గురువారం గుత్తులపుట్టు, మజ్జిగరువు, శుక్రవారం పాడేరు, అరకు వారపు సంతల్లో గుమ్మడికాయల వ్యాపారం భారీగా జరిగింది. వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు.

పుణ్యక్షేత్రాలకు..

తిరుమల తిరుపతి, సింహాచలం, అన్నవరం, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లోని నిత్యాన్నదానంకు మన్యం గుమ్మడికాయలను వినియోగిస్తున్నారు. స్థానికంగా కొనుగోలు చేసి దేవస్థానాలకు సరఫరా చేస్తుంటారు. సేంద్రియ పద్ధతిలో గిరిజనులు సాగు చేయడం వల్ల దేశవాళి గుమ్మడికాయలు మంచి రుచికరంగా ఉంటాయి. అందువల్ల మార్కెట్లలో కూడా మంచి డిమాండ్ ఉంది.

పండగ సీజన్‌లో..: సంక్రాంతి సీజన్‌లో

వినియోగం ఎక్కువగా ఉన్నందున వ్యాపారులు గిరిజనుల వద్ద పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. దీంతో వారు మంచి ధర పొందుతున్నారు. ప్రస్తుతం సీజన్ మొదలవడంతో గిరిజనులు అమ్మకాల్లో నిమగ్నమయ్యా రు. వారపు సంతల్లో వ్యా పారం జోరందుకుంది.

గుమ్మడి బంధం

సంక్రాంతి పండగతో గుమ్మడి కాయకు నం బంధం ఉంది. మకర సంక్రాంతి రోజున సూర్యుడు మకరరాశిలో ప్రవేశిస్తాడు. మకర రాశికి అధిపతి శని భగవానుడు. ఆ రోజు తెలకపిండి నలుగుతో



హుకుంపేట మండలం మఠం గ్రామంలో జామచెట్టుకు వేలాడదీసిన గుమ్మడికాయలు

స్నానం చేసి శనీశ్వరుని ప్రీతి కోసం నువ్వులు, **గుమ్మడి కా**యలు దానం చేయడం మైదాన ప్రాం**తాల్లో పూర్వం** నుంచి ఆనవాయితీగా వస్తోంది. **గుమ్మడి వం**డు భూమండలానికి ప్రతీక. దీనిని పేద**లకు, బ్రాహ్మ**ణులకు దానం చేస్తే భూదేవితో పాటు **శ్రీమహా విష్ణు**వు అనుగ్రహం లభిస్తుందని ప్రజల **విశ్వసిస్తుంటా**రు.

పోషక విలువలెన్నో..

- **గుమ్మడికా**యను తరచూ తీసుకోవడం వల్ల **ఎముకల** దృఢత్వానికి కావాల్సిన కాల్షియం **పుష్కలం**గా అందుతుంది. దీనివల్ల కీళ్లనొప్పులు, మోకాళ్లనొప్పులు, బోలు ఎముకల వ్యాధి వంటి రోగాలు దరి చేరవు. ఫైబర్ జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి దోహదపడుతుంది. కంటి ఆరోగ్యం మెరుగుకు ఉపయోగపడుతుంది. విటమిన్ సి, యాంటీ బాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉన్నందున రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో ఉపయోగపడుతుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను కరిగించడమే కాకుండా, అధిక బరువును నియంత్రణలోకి తెస్తుందని పోషణ నిపుణులు చెబుతున్నారు.

రూ.50 ధరకు అమ్మా



ఇంటి పరిసరాలతో పాటు కొండపోడులో గుమ్మడి విత్తనాలు చల్లాం. దిగుబడి బాగానే ఉంది. గుమ్మడికాయలను పిందెల సమయంలోనే వంట వండుకుతిన్నాం. బాగా పండిన తరువాత అరకు సంతలో రెండు దఫాలుగా అమ్మాం. ఒకొక్క కాయ రూ.50కు విక్రయించగా రూ.వెయ్యి ఆదాయం వచ్చింది. కొన్ని కాయలను తిండి అవసరాలకు దాచుకున్నాం.
– వంతాల చంపా, నందివలస, డుంబ్రిగుడ మండలం

గ్రామాల్లోకి వచ్చి కొంటున్నారు



గతంలో గుమ్మడికాయలను అమ్మేవారిమి కాదు. వ్యాపారులు గ్రామాలకే వచ్చి గుమ్మడికాయలను కొంటుండడంతో పాదులు ఎక్కు వ వేస్తున్నాం. గుమ్మడికా యలు సాగు చేయడం ద్వారా వచ్చే నగదును తమ అవసరాలకు ఉపయోగించుకుంటాం. గుమ్మడితో తమకు విడదీయరాని బంధం ఉంది. ఆచార సంప్రదాయంలో భాగంగా పండిస్తుంటాం.
– కిల్లో కమలమ్మ, జోడిగుడ, హుకుంపేట మండలం

పెరుగుతున్న వినియోగం



సహజసిద్ధంగా పండుతున్న గుమ్మడి పండ్లను నాలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా వినియోగిస్తున్నారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో మార్కెట్లకు మాత్రమే ఎగుమతి చేసేవాళ్లం. ఇప్పుడు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో రాష్ట్రాల్లో వినియోగం భాగా పెరిగింది. పోషక విలువలు ఎక్కువగా ఉండటంతో ఆయా రాష్ట్రాల ప్రజలు కూడా వంటకాల్లో వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందువల్ల మార్కెట్లలో పోటీపడి కొనుగోలు చేస్తున్నాం.
– వెంకట అప్పారావు, గుమ్మడి వ్యాపారి, పాడేరు

నిత్య వంటకం

గిరిజనులంతా గుమ్మడికాయలను ఏడాది పొడవునా దాచుకుంటూ నిత్య వంటకంగా వినియోగిస్తుంటారు.అలాగే ఇంటికి వచ్చే చుట్టాలు, బంధువులకు కూడా వీటి వండి పెడుతారు. సంక్రాంతి, ఇతర పండగల సమయంలోను గుమ్మడికాయలను కోసి గ్రామాల్లో ఒకరికొకరు పంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ముదిరిన గుమ్మడికాయలు పాడవకుండా ఉండేలే ఇంటి పరిసరాల్లో ఉండే జామ, మామిడి, పనసవంటి చెట్లకు వేలాడిదీసి భద్రపరుస్తారు. చెట్టుకు కట్టిన గుమ్మడికాయలను దొంగిలించే పరిస్థితి కూడా ఉండదు.



పాడేరులో వ్యాపారులు కొనుగోలు చేసిన గుమ్మడికాయలు

గోల్డెన్ జూబ్లీ స్థూపం ఆవిష్కరణ

- పాడేరు ఐటీడీఏ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు
- గిరిజనుల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి: పీవో అభిషేక్



గోల్డెన్ జూబ్లీ స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : ఐటీడీఏకు నూతన శోభ సంతరించుకుంది. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఐటీడీఏ ఆవరణలోని పార్క్ వద్ద నెలకొల్పిన గోల్డెన్ జూబ్లీ స్థూపాన్ని ఐటీడీఏ పీవో అభిషేక్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకుని తమ జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. గిరిజనాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాడేరు ఐటీడీఏ పని చేసిందన్నారు. మున్ముందు కూడా గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి మరింత తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, ఐటీడీఏ ఏవో హేమలత, టీడబ్ల్యూ ఈఈ డేవిడ్‌రాజు, టీడబ్ల్యూ ఇన్‌చార్జి డీడీ రజని, పీఆర్వో రాములు పాల్గొన్నారు.

మీకోసంలో 53 వినతుల స్వీకరణ



వినతులను స్వీకరిస్తున్న డీఆర్వో పద్మలత

పాడేరు : ప్రజల నుంచి స్వీకరించిన వినతుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని డీఆర్వో పద్మలత సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 53 వినతులను స్వీకరించారు. ప్రధానంగా భూమి, తాగునీరు, రహదారుల సమస్యలు, జనమ్‌న్ ఇళ్ళ మంజూరు, పూర్తి చేసిన గృహాలకు బిల్లులు చెల్లించాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని తదితర సమస్యలపై వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినతులు పరిష్కారం కాకుంటే అందుకు గల కారణాలను అర్జీదారుడికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూ ఇంచార్జి డీడీ రజని, ఐటీడీఏ ఏవో హేమలత, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ నర్సింహులు, డీఈవో బ్రహ్మజీరావు పాల్గొన్నారు.

మోదమ్మ ఆలయంలో అన్నదానం



భక్తులకు వడ్డిస్తున్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ కాంతమ్మ తదితరులు

పాడేరు రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మతల్లి ఆలయంలో శుక్రవారం భక్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబు, సభ్యులు రామకృష్ణ, రాంబాబు, రమణ,రత్నభాయ్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు



వ్యూపాయింట్ వద్ద పొగమంచు అందాలు

కొత్తపల్లి జలపాతం వద్ద శుక్రవారం సూర్యోదయం వేళ ప్రకృతి అందాలు కనువిందుచేశాయి. మంచు అందాలు పాలసముద్రాన్ని తలపించాయి. జి.మాడుగుల-చింతపల్లి మార్గంలో వెళ్లేవారు ఈ అపురూప దృశ్యాలను తిలకించారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. **– జి.మాడుగుల**

వ్యాపారుల నుంచి నగదు లాక్కొని పరారీ

- రూ.19.76 లక్షల నగదు పట్టుకుపోయిన దుండగులు
- కేసు నమోదు చేసిన పోలీసులు

డుంబ్రిగుడ: అరకు వారపు సంతకు కొనుగోళ్ల నిమిత్తం ఇద్దరు వ్యాపారులు తీసుకువచ్చిన నగదును గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు లాక్కొని పరారయ్యారు. శుక్రవారం ఉదయం విజయనగరం జిల్లా ఎస్‌కోట మండలానికి చెందిన వ్యాపారులు కాపుగంటి రామచంద్రరావు, తిరుమలరావు రూ.19,76,300 నగదుతో శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో వారి గొడౌన్ వద్ద వేచి ఉన్నారు. గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు వారి వద్దకు వచ్చి నగదు ఉన్న రెండు బ్యాగ్‌లను లాక్కొని పరారయ్యారు. ఈ మేరకు తమకు ఫిర్యాదు అందిందని ఎస్ఐ కె.పాపినాయుడు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిని పట్టుకునేందుకు మూడు బృందాలు రంగంలోకి దిగాయని ఆయన వెల్లడించారు.

గుమ్మిరేవుల బస్సు పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

గూడెంకొత్తవీధి: మండలంలోని గుమ్మిరేవులకు బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు శుక్రవారం నుంచి పునరుద్ధరించారు. గత ఏడాది సెప్టెంబరులో తుపాను ప్రభావంతో కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో రహదారి ఛిద్రమైంది. మండల కేంద్రం నుంచి సీలేరు వరకూ పలు చోట్ల రహదారి పూర్తిగా మూసుకుపోయింది. కొన్ని చోట్ల కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఈనేపథ్యంలో నర్సీపట్నం నుంచి గుమ్మిరేవుల బస్సును ఆర్టీసీ అధికారులు రద్దుచేశారు. అధికారులు రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించినా గుమ్మిరేవుల బస్సును తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజల ఇబ్బందులపై గత డిసెంబర్ 31న గుమ్మిరేవుల బస్సు సర్వీసును పునరుద్ధరించాలి శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితం అయింది. దీనిపై స్పందించిన ఆర్టీసీ అధికారులు శుక్రవారం నుంచి బస్సు సర్వీసును పునరుద్ధరించారు.

ఆలస్యంగా బయలుదేరిన రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా విశాఖపట్నం చేరుకోవడంతో.. శుక్రవారం ఇక్కడి నుంచి పలు రైళ్లు ఆలస్యంగా బయలుదేరాయి. శుక్రవారం సాయంత్రం 4.55 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం-దుర్గ్ ఎక్స్‌ప్రెస్ (18530) సుమారు 1.15 గంటలు ఆలస్యంగా సాయంత్రం 6:10 గంటలకు బయలుదేరింది. అలాగే శుక్రవారం రాత్రి 11.20 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా శనివారం తెల్లవారుజామున 1.20 గంటలకు బయలుదేరింది.

ఘనంగా ముక్కోటి ఏకాదశి



భక్తుల పూజలందుకున్న ఉత్సవ విగ్రహం



స్వామివారికి మేల్‌చాట్ వస్త్రాలు సమర్పిస్తున్న భక్తులు

రంపచోడవరం టీటీడీ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి తరలివచ్చిన భక్తజనం

రంపచోడవరం: వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఐ.పోలవరంలోని టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామి వారికి ఉదయం 4 గంటల నుంచి 4.30 వరకు తిరుప్పావై, తరువాత నుంచి 5 గంటల వరకు విశేష ఆరాధన, 5.30 వరకు శుక్రవార అభిషేకం, 5.30 నుంచి 7 గంటల వరకు శుద్ధి సమర్పణ, తరువాత అర్చన, తోమాల, సర్వదర్శనం, వైకుంఠ ద్వారా దర్శనం, సాయంత్రం 6 గంటలకు శుద్ధి నిర్వహించారు. ఆరు గంటల నుంచి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. సామర్లకోటకు చెందిన భక్తులు మేల్‌చాట్ వస్త్ర సమర్పణ చేశారని ఆలయ అధికారి నారాయణరాజు తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీవారి సేవల బృందం సమన్వయకర్త నల్లమిల్లి వెంకటరామారెడ్డి తెలిపారు. ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు.

సాక్షి,పాడేరు: అనంతగిరి మండలంలోని వైకుంతగిరి,అరకులోయలోని పురాతన వేంకటేశ్వరస్వామి,పాడేరులోని సుండ్రుపుట్టు వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు,ఉమా నీలకంఠేశ్వరస్వామి,అయ్యప్పస్వామి ఆలయాల్లో పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలకు భక్తులు పాలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో వైద్యుడు తమర్బ నర్సింగరావు, ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు,రమాదేవి దంపతులు పాల్గొన్నారు.భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.



పాడేరులో వేంకటేశ్వరస్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న డాక్టర్ నరసింగరావు, సింహాచలంనాయుడు,ఇతర భక్తులు

పాడేరు కళకళ



పాడేరులో కిక్కిరిసిన ప్రధాన రహదారి

- వారపు సంతకు భారీగా గిరిజనం
- కిక్కిరిసిన మెయిన్‌రోడ్డు
- భారీగా వస్త్ర వ్యాపారం

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం జరిగిన వారపుసంతకు భారీగా గిరిజనులు తరలివచ్చారు. సంక్రాంతి పండగతో కొత్త దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు పరిసర మండలాల నుంచి కుటుంబ సమేతంగా గిరిజనులు రావడంతో సంత ప్రాంగణంతోపాటు మెయిన్‌రోడ్డు, సినిమాహాల్ సెంటర్ కిక్కిరిసిపోయాయి. వస్త్ర వ్యాపారం భారీగా జరిగింది.

క్లుప్తంగా

ఘనంగా రాపత్తు ఉత్సవాలు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం సాయంత్రం నుంచి రాపత్తు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పదిరోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్వామికి వైకుంఠనాథుడి అలంకారం చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ నెల 19 వరకు జరిగే రాపత్తు ఉత్సవాల్లో రోజుకో అలంకారంలో స్వామివారికి తిరువీధి నిర్వహిస్తారు.

విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో సంక్రాంతి ఆఫర్లు

విశాఖ సిటీ: నగరంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో పలు క్రీడలకు సంక్రాంతి ఆఫర్స్ అందిస్తున్నట్లు క్లబ్ చైర్మన్ బొడ్డేటి కాశీ విశ్వనాథం ఓ ప్రకటనలో తెలిపారు. గో కార్టింగ్, వాటర్ వరల్డ్, స్విమ్మింగ్ పూల్, 12డీ థియేటర్, గియాంట్ స్వింగ్, 360 డిగ్రీస్ సైకిల్, రాకెట్ ఎజెక్టర్.. ఇలా పలు క్రీడలకు ఆఫర్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు అన్ని క్రీడా విభాగాలపై 20 శాతం డిస్కౌంట్ ఉంటుందని వివరించారు. విశ్వనాథం స్పోర్ట్స్ క్లబ్‌కు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన యూనిక్ టూరిజం ప్రాజెక్ట్ అవార్డును అందజేసిందన్నారు. ఈ అవకాశాన్ని విశాఖ ప్రజలు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

15న మహా బౌద్ధమేళా

అనకాపల్లి: మండలంలో శంకరం పంచాయతీ బొజ్జన్న కొండ వద్ద ఈనెల 15న కనుమపండగ నాడు మహాబౌద్ధ మేళా నిర్వహించనున్నట్టు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం తెలిపారు. స్థానిక చిన్నరాజుపేటలో అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాబౌద్ధ మేళా కరపత్రాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి అధిక సంఖ్యలో వచ్చే పర్యాటకులు బొజ్జన్న కొండను సందర్శిస్తారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బొజ్జన కొండ వద్ద పర్యాటకుల కోసం కేంద్ర పర్యాటకశాఖ నిధులతో క్యాటేజీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కనుమరోజున సుమారు లక్షమంది ఇక్కడికి వస్తారని, పురావస్తుశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పట్నాల కృష్ణ మోహన్, కొత్తూర్తి రామారావు, బొడ్డు సోమరాజు, ఉజ్జి సత్యనారాయణ, జిల్లా బుద్ధిస్ట్ సొసైటీ అధ్యక్షుడు పల్లా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ

- వడ్డాదిలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్త జనం



శ్రీదేవి,భూదేవితో వేంకటేశ్వరస్వామి



గిరి ప్రదక్షిణలో భక్తుల కోలాటాలు

బుచ్చెయ్యపేట(అనకాపల్లి): ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం వైకుంఠ ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. గత ఆరేళ్లుగా వడ్డాదిలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా ఉదయం 6 గంటల నుంచే వేంకటేశ్వరస్వామి కొండ దిగువన తొలిమెట్టు వద్ద నుంచి చిన్న, పెద్ద అన్న తేడా లేకుండా చలిని సైతం లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. తిరుపతి నుంచి తీసుకొచ్చిన ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంపై ఉంచి కోలాటం, తదితర సాంస్కృతిక ప్రదర్శన మధ్య గిరి ప్రదక్షిణ సాగింది. ఈ క్రమంలో స్వామివారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. గిరిజాంబ కొండ ప్రాంతం, ఆలయ పరిసరాలు వేంకటేశ్వరస్వామి నామస్మరణతో మార్మోగాయి. ఆలయ ధ్వజ స్తంభం, ముఖ ద్వారం, ఆలయ మండపం వద్ద భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఐదు కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ సాగగా.. రాత్రి వరకు భక్తులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామిని తులసీ, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు, గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



గిరి ప్రదక్షిణలో భక్తులు

సైబర్ నేరాలపై అప్రమత్తం



జప్పారులో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ



జీఎం కొత్తూరు వద్ద వాహన రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

ముంచంగిపుట్టు: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు.మండలంలోని జోలాపుట్టు పంచాయతీ జప్పారు గ్రామంలో శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు అధికమయ్యాయని, వీటి పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

జి.మాడుగుల: మండలంలో జీఎం కొత్తూరు రోడ్డు జంక్షన్ వద్ద శుక్రవారం సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనచోదకులు తప్పనిసరిగా వాహన రికార్డులు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

244 పోస్టులకు 15,512 దరఖాస్తుల స్వీకరణ

సాక్షి,పాడేరు: స్థానిక వైద్య కళాశాల,జిల్లా సర్వజన ఆస్పత్రుల్లో అవుట్ సోర్సింగ్,కాంట్రాక్ట్ పద్ధతుల్లో భర్తీచేయనున్న 244 పోస్టులకుగాను 15,512 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5గంటలతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని ఆమె పేర్కొన్నారు.

26మందిపై బైండోవర్ కేసులు



మొల్లేరులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

గంగవరం : మండలంలో గతంలో కోడి పందాలు, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాల్లో పట్టుపడ్డ కేసుల్లోని 26మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.వెంకటేష్ తెలిపారు. ఆయన మొల్లేరు గ్రామంలో శుక్రవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. కోడిపందాలు, జూదం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. గతంలో వివిధ కేసుల్లో నమోదు కాబడి ఉన్న 26 మందిని తహసీల్దార్ కోర్టులో బైండవర్ చేసినట్టు ఆయన వివరించారు.

పోలీసుల దర్యాప్తు ఆధారంగా చర్యలు

> సెల్‌ఫోన్ల వ్యవహారంపై ఐజీ ఇండ్ల శ్రీనివాస్ వ్యాఖ్య

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీల బ్యారక్‌ల వద్ద దొరికిన నాలుగు సెల్‌ఫోన్ల వ్యవహారంపై పోలీసులు దర్యాప్తులో వెల్లడైన విషయాల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. జైలు డిప్యూటీ సూపరింటెండెంట్లు ప్రవీణ్‌కుమార్, జవహర్‌బాబు, జైలర్లతో కలిసి ఆయన పలు విభాగాలను పరిశీలించారు. బ్యారక్‌ల వద్ద ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న భోజనం, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల సెల్‌ఫోన్‌లు దొరికిన బ్యారక్‌లను పరిశీలించి.. సెల్‌ఫోన్‌లు ఎక్కడ దాచిపెట్టారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ జైలులో మరింత పటిష్టమైన రక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం 9 సీసీ కెమెరాలు పని చేస్తున్నాయని, వాటి సంఖ్యను 496కు పెంచుతామన్నారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో 400 మంది సిబ్బంది నియామకానికి సన్నాహాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇప్పటికే ఏఏ జైళ్లలో ఎంత మంది సిబ్బంది అవసరమో ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో రూ.100 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. విశాఖ జైలులో రూ.15 కోట్లు, రాజమండ్రిలో రూ.33 కోట్లు, కడప జైలులో రూ.5 కోట్లతో అదనపు బ్యారక్‌ల నిర్మాణం, దర్శి జైలును రూ.35 కోట్లతో ఆధునికీకరించనున్నట్లు వివరించారు. మిగిలిన నిధులతో సీసీ కెమెరాలు, టెక్నాలజీ పనులు, ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేస్తామన్నారు. సుమారు 200 మంది అర్హులైన శిక్ష పడిన ఖైదీల క్షమాభిక్ష కోసం ప్రభుత్వానికి జాబితా పంపించామని, ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం కోసం వేచి ఉన్నట్లు ఐజీ తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకునికి 20 ఏళ్లు జైలు శిక్ష

విశాఖ లీగల్: మాయ మాటలతో బాలికను నమ్మించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన యువకునికి 20 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది శుక్రవారం తీర్పు చెప్పారు. బాలికకు రూ.4 లక్షలు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.వి.ఆర్.మూర్తి అందించిన వివరాలు.. నిందితుడు చిప్పాడ భార్గవ్ అలియాస్ టిక్ టాక్ భార్గవ్ నగరంలోని పూర్ణ మార్కెట్ దగ్గర కొబ్బరితోటలో ఉంటున్నాడు. సినిమాల్లో నటించిన అనుభవంతో పాటు టిక్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహించేవాడు. బాధిత బాలిక కూడా అదే ప్రాంతానికి చెందినది. తొమ్మిదో తరగతి చదివింది. నిందితుడు బాలికకు వివిధ రకాల వీడియోలు చూపించి లోబరుచుకున్నాడు. అంతటితో ఆగకుండా ఆమెపై తరచూ శారీరకంగా కలిసేవాడు. లైంగిక దాడికి పాల్పడేవాడు. దీంతో బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు, అప్పటి దిశ పోలీస్ స్టేషన్ అధికారి డాక్టర్ ప్రేమ్ కాజల్ నిందితునిపై భారతీయ శిక్షాస్మృతి పలు సెక్షన్ల కింద, పోక్సో చట్టం సెక్షన్ 5 కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

ముగిసిన అంధుల మహిళా క్రికెట్ జట్టు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఏపీ అంధుల జట్టు

విశాఖ స్పోర్ట్స్: జాతీయ స్థాయి అంధుల మహిళా క్రికెట్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. కేరళలోని కొచ్చిన్‌లో ఈ నెల 13 నుంచి ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియంలో వారం రోజుల పాటు ఈ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా జట్టును ఆంధ్ర క్రికెట్ సంఘం అపెక్స్ కౌన్సిల్(ఏసీఏ) కార్యదర్శి సానా సతీష్‌బాబు అభినందించారు. టోర్నీ రాష్ట్ర జట్టు విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కొచ్చిన్‌లో ఆడేందుకు శనివారం బయలుదేరి వెళ్లనున్న జట్టు సభ్యులకు విమాన ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, మరిన్ని సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు వెంకటరామప్రశాంత్, కమిటీ ప్రతినిధి సూర్యనారాయణ, క్రికెటర్ భరత్, జట్టు కెప్టెన్ సత్యవతి, వైస్ కెప్టెన్ రమ్య, కోచ్ అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముంచెత్తిన మంచు



ముంచంగిపుట్టులో దట్టంగా కురుస్తున్న మంచు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండలంలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతూ వస్తుంది. గిరిజన గ్రామాలపై చలి పంజా విసురుతోంది. మంచు దట్టంగా కురుస్తుండడంతో రోజువారీ పనులకు వెళ్లే కూలీలు,ఉద్యోగులు,వ్యాపారులు గజగజ వణుకుతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి చలి మొదలు ఉదయం 10 గంటల వరకు చలితీవ్రత అధికంగా ఉంటుంది.చలి నుండి ఉపశమం పొందేందుకు గ్రామాల్లో చలి మంటలు వేసుకుంటున్నారు.వాహనాదరులు హెడ్‌లైట్ వేసుకొని మంచులో రాకపోకలు సాగిస్తున్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

బీచ్‌రోడ్డు: బాలికను ప్రేమించి మోసం చేసిన యువకుడిని పోక్సో కేసులో మూడో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివీ.. చిన్నవాల్తేరు రెల్లి వీధికి చెందిన ఆటోడ్రైవర్ బాలికను ప్రేమ పేరుతో మోసం చేశాడు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న భార్యాభర్తలు అరెస్టు

నాతవరం: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న భార్యాభర్తలను అరెస్టు చేశామని ఎస్ఐ సిహెచ్. భీమరాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలో నర్సీపట్నం – తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డులో మన్యపురట్ల జంక్షన్ వద్ద శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో నర్సీపట్నం నుంచి తుని వైపు ఆటోలో వస్తున్న నిందితులు వాహన తనిఖీలు చూసి అక్కడ దిగి నడిచిపోతున్నారు. పోలీసులకు అనుమానం వచ్చి వారిని ఆపి బ్యాగ్‌లు తనిఖీలు చేయగా, రూ.50 వేల విలువైన గంజాయి లభ్యమైంది. పట్టుబడిన వారు తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా ఐరుకుపల్లి గ్రామానికి చెందిన రాథోడ్ తుకారాం, రాథోడ్ కమలాబ్బాయిగా గుర్తించారు. వారి నుంచి 8 కేజీల గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరు కొంతకాలంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి కొనుగోలు చేసి, తమ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

‘మీ చేతగానితనాన్ని ఇతరుల మీదకు నెట్టేస్తారా?’

> జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



జిల్లా పరిషత్ చైరపర్సన్ సుభద్ర

మహారాణిపేట(విశాఖ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రంలో ఏం జరిగినా.. గత ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అనడం వారి చేతగానితనానికి నిదర్శనమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా పాలన మీద గానీ, వ్యవస్థల మీద గానీ పట్టు సంపాదించలేకపోయారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ తప్పిదం జరిగినా గత ప్రభుత్వం మీదకు నెట్టేస్తూ కాలక్షేపం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని, ఇది కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జరిగిందని ఆమె ఆరోపించారు. ఈ ప్రమాదంలో విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. 2,500 మందికే కనీస ఏర్పాట్లు చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసి.. భక్తుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపిందని మండిపడ్డారు. వైకుంఠ ఏకాదశికి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వస్తారన్న విషయం ప్రభుత్వానికి తెలిసినా.. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించిందో సీఎం, డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ‘మా ప్రాణాలు పోతున్నాయి. అంబులెన్స్ సదుపాయం కల్పించండి’అని తొక్కిసలాటకు గురైన భక్తులు ప్రాధేయపడినా అధికారులు స్పందించలేదన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

398 కిలోల గంజాయి స్వాధీనం: ఇద్దరు అరెస్టు



పన్నెడ జంక్షన్ వద్ద పట్టుకున్న గంజాయి, వ్యక్తులతో ఎస్ఐ రమణ, పోలీసులు

పెదబయలు: మండలంలో గల సీకరి పంచాయతీ పన్నెడ వద్ద జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న 398 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కె.రమణ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసు సిబ్బందితో పన్నెడ జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఒడిశా నుంచి జీపు, బైకుతో వస్తున్న వ్యక్తులు పోలీసులను చూసి జీపు, బైకును వదిలి, పారిపోతుండగా వారిని పట్టుకున్నట్టు ఎస్ఐ రమణ చెప్పారు. జీపులో ఉన్న బస్తాలను తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో తూనిక వేయగా 398 కిలోల గంజాయిగా గుర్తించమని, దీని విలువ రూ.19.09లక్షలు ఉంటుందని, పట్టుకున్న గంజాయి స్మగ్లర్లు చిత్తురు జిల్లా తిరుపతిలోని వినాయక నగర్ కాలనీకు చెందిన లాపాక్షి బాబా పక్రుద్దిన్, పాడేరులోని గాంధీనగర్‌కు చెందిన భచ్చుల పవన్‌కుమార్‌లుగా గుర్తించి, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. పట్టుకున్న గంజాయిని, జీపు, బైకులను పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామని ఎస్ఐ రమణ తెలిపారు. తనిఖీల్లో స్థానిక పోలీసులు సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని వినతి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న దండకారణ్య విమోచన సమితి సభ్యులు తదితరులు

పాడేరు : రాజ్యాంగంలో పొందిపర్చిన ఆదివాసీల హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేసిన 5వ షెడ్యూల్ భూభాగాన్ని, స్థానిక ఆదివాసీలకు రక్షణ కల్పించాలని దండకారణ్య విమోచన సమితి కేంద్ర కమిటీ ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం, సలహాదారులు చెండా కేశవరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం దండకారణ్య విమోచన సమితి, అనుబంధ సంఘాల ప్రతినిధులు కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి సమావేశమయ్యారు. ఆదివాసీ ప్రాంతంలో 1/70 చట్టం, పీసా కమిటీ చట్టాలు ఏ మాత్రం అమలు కావడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో భూ సమస్యలు రోజు,రోజుకు అధికమవుతున్నాయన్నా. ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థుల మరణాల విషయంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు అవలంభిస్తున్న తీరు సక్రమంగా లేదన్నారు. గిరిజనుల కోసం ఉన్న జీవోలు, చట్టాలు సక్రమంగా అమలు చేయాలన్నారు. ఆదివాసీల భూములను కబ్జా చేస్తున్న గిరిజనేతరులను అడ్డుకుంటే గిరిజనులపై దాడులకు తెగబడుతున్నారన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజన ఉద్యోగ నియామక చట్టం చేసి నూరుశాతం ఉద్యోగాలు ఆదివాసీల చేత భర్తీ చేయాలన్నారు. గిరిజన విద్యార్థులు మరణిస్తే వారి కుటుంబాలకు తగిన పరిహారం ఇవ్వడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. దండకారణ్య విమోచన సమితి ప్రతినిధులు ఆనందరావు, బాలకృష్ణ, రాజాబాబు, గంపదొర ధనుంజయ, శేఖర్, కాసులమ్మ, డీఎల్ఓ జిల్లా అధ్యక్షుడు కాంతారావు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

నేషనల్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్)లో బోకియా నేషనల్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ పోటీలను వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి ప్రారంభించారు. సంకల్పం, నైపుణ్యం, క్రీడా స్ఫూర్తితో 21 రాష్ట్రాలకు చెందిన వంద మంది పారా అథ్లెట్లు ఈ పోటీల్లో పోటీపడుతున్నారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారికి ఆసియా పారా గేమ్స్‌లో పాల్గొనే అవకాశాన్ని పరిశీలిస్తారు. ఈ నెల 15వ తేదీతో ముగియనున్న ఈ పోటీల్లో సెరిబ్రల్ పాల్సీ, కండరాల బలహీనతతో సహా తీవ్రమైన వైకల్యాలు ఉన్న అథ్లెట్లు తమ అసాధారణ నైపుణ్యాలను, పోటీ స్ఫూర్తిని ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ సుబ్రమణి మాట్లాడుతూ ఏఎంటీజెడ్ దేశాభివృద్ధికి అద్భుతమైన సహకారాన్ని అందిస్తోందన్నారు. వైద్య సాంకేతికతలో పురోగతి సాధించడమే కాకుండా ‘మేక్ ఇన్ ఇండియా’, ‘వికసిత్ భారత్’దృక్పథంతో కంపెనీలు వృద్ధి చెందడానికి ప్రేరణ, ఉపాధి, ప్రోత్సాహం పొందేలా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ఏఎంటీజెడ్‌లో పర్యటించారు. దేశ ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసే ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఆత్రియం భవనానికి శంకుస్థాపన చేశారు. సహాయక సాంకేతికత కోసం అధునాతన పరిశోధన, ఆవిష్కరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో ఏఎంటీజెడ్ ఎండీ, వ్యవస్థాపక సీఈవో జితేంద్ర శర్మ, బోకియా ఇండియా చైర్మన్ అశోక్ బేడీ, అధ్యక్షుడు జస్ప్రీత్ సింగ్, స్పోర్ట్స్ సమాఖ్య కార్యదర్శి షమిందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని సెక్యూరిటీ గార్డు మృతి

- మృతుడిది ఒడిశా రాష్ట్రం

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి ఎస్ఈజెడ్‌లోని వినూత్న ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డు శుక్రవారం ఉరేసుకుని మృతి చెందాడు. రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన సుదర్శన్ కుమార్ పాటి (20) ఆర్నెల్ల నుంచి వినూత్న ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా గురువారం సాయంత్రం 6 గంటలకు వెళ్లగా, శుక్రవారం ఉదయం సుదర్శన్ పనిచేస్తున్న ప్రాంతంలో ఉరేసుకున్నాడు. అక్కడ పనిచేస్తున్న కూలీలు గమనించి స్థానికులకు లాలంకోడూరు వీఆర్వోకు సమాచారమిచ్చారు. మృతుడి కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత మృతదేహాన్ని అప్పగిస్తామని, మృతికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.